క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ రూరల్: ప్రమాదవశాత్తు మృతి చెందిన గాయత్రి బ్యాంక్ ఖాతాదారుడి కుటుంబ సభ్యులకు ప్రమాదబీమా కింద రూ. ఒక లక్ష బీమా చెక్కును అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా శుక్రవారం అందజేశారు. బ్యాంకు ఖాతాదారుడు సదా రంజిత్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా ప్రమాద బీమా కింద రూ. ఒక లక్ష మంజూరైంది. బ్యాంక్ అధికారులు ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు సుమన్, మర్పక నవీన్, అంకం రాజేందర్ పాల్గొన్నారు.

కవులకు సన్మానం



కవులను సన్మానిస్తున్న సమాఖ్య సభ్యులు

నిజామాబాద్ రూరల్: తెలుగు–వెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని సీతారాంనగర్‌లో ప్రముఖ కవులు మహేశ్‌బాబు, అశోక్ గణపతిశర్మలను సమాఖ్య ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి వీపీ చందన్‌రావు, కవులు పాల్గొన్నారు.

సీపీకి వినతిపత్రం అందజేత

నిజామాబాద్ రూరల్: విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12న చేపట్టే వీర హనుమాన్ విజయయాత్రల అనుమతి కోసం సభ్యులు సీపీ సాయిచైతన్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా అజరామర పదంలో 60 ఏళ్లు అని రూపొందించిన పుస్తకాన్ని సభ్యులు సీపీకి అందజేశారు. కార్యక్రమంలో తమల కృష్ణ, దినేశ్ ఠాకూర్, గాజుల దయానంద్, దాత్రిక రమేశ్, కోడిమల శ్రీనివాస్, నికేశ్, ఇందూరు సురేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు..

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు నిజామాబాద్ కెనరా బ్యాంక్ రీజినల్ చీఫ్ మేనేజర్ బి చంద్రశేఖర్, రీజినల్ అసిస్టెంట్ మేనేజర్ బి శ్రీనివాస్ శుక్రవారం రెండు క్రికెట్ కిట్లను కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డికి శుక్రవారం అందజేశారు. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతలో భాగంగా కళాశాలకు క్రికెట్ కిట్లను అందించినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, బాలమణి, భరత్ రాజ్, రామస్వామి, ఉదయ్ భాస్కర్, బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న సీపీ

ఖలీల్‌వాడి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటామని సీపీ సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ పి శంకర్ ఈ నెల 13న సారంగపూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పరంగా మంజూరైన రూ. ఐదు లక్షల చెక్కును సీపీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి సీపీ అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ లు జి బస్వారెడ్డి, కె రామచంద్రరావు, ఏవో అనిసాబేగం, రిజర్వ్ సీఐ శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షకీల్ పాషా తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ 2025–26 ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు ఎన్నికల అధికారులుగా సీనియర్ న్యాయవాదులు వెంకటేశ్వర్, ఆర్ఎస్ఎల్ గౌడ్‌లను నియమిస్తూ నిజామాబాద్ బార్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ చైర్మన్ ఆకుల రమేశ్, సభ్యులు బాస రాజేశ్వర్, నరసింహరెడ్డి, శ్రీహరి ఆచార్య ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, క్రీడా కార్యదర్శి, సాంస్కృతిక కార్యదర్శి, కోశాధికారి పదవులతో పాటు కార్యవర్గ సభ్యుల పదవులకు మార్చి 22 నుంచి 26వరకు నామినేషన్ పత్రాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. 27న నామినేషన్ పత్రాల పరిశీలన, 28న నామినేషన్ల ఉపసంహరణ, ఏప్రిల్ 4న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు న్యాయవాదులు తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామన్నారు.

సమస్యలతో సహవాసం



ఆనంద్‌నగర్‌లో రోడ్డుపైనే ఉన్న చెత్త



డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

- డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇళ్ల మధ్య నిలిచిన మురుగు
- కాలనీలో ఎక్కడి చెత్త అక్కడే
- పారిశుధ్య పనులు చేపట్టని సిబ్బంది
- కానరాని మున్సిపల్ చెత్తబండ్లు
- ఇబ్బందుల్లో ఆనంద్‌నగర్ కాలనీవాసులు

ఇంటి నుంచి రోడ్డుపైకి వస్తే ముక్కు మూసుకోవాల్సిందే.. ఇళ్లలో కిటికీలు తెరుచుకొని నిద్రించాలంటే దోమల భయం.. అధ్వాన డ్రెయినేజీలు, అపరిశుభ్రత.. సీజనల్ వ్యాధులు.. ఇదీ నగరంలోని ఆనంద్‌నగర్ కాలనీవాసుల పరిస్థితి. పేరుకు కాలనీ మున్సిపల్ పరిధిలో ఉన్నా పల్లెల కంటే పరిస్థితి దారుణంగా ఉంది. అదీ ఇదీ అని కాకుండా పలు రకాల సమస్యలతో కాలనీవాసులు సహజీవనం.. సహవాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. పేరుకు పాలకులు.. అధికారులు.. విభాగాల వారీగా సిబ్బంది.. ఇలా ఎందరున్నా ఆ కాలనీవాసుల ఇబ్బందులు మాత్రం ఎవరికీ పట్టడం లేదు. అధికారులు తమపై అన్ని రకాల పన్ను వసూలు చేస్తున్నా కాలనీ సమస్యలు మాత్రం తీర్చడం లేదంటు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఆనంద్‌నగర్ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. కాలనీలో నెలకొన్న అనేక సమస్యలతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేరుకుపోతున్న చెత్త, ఇళ్ల మధ్యే చేరుతున్న మురుగు ఇలా అనేక సమస్యలతో కాలనీవాసులు సహవాసం చేస్తున్నారు. కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, అపరిశుభ్రత, ఇళ్ల మధ్య చేరుతున్న మురుగుతో ఇబ్బందులు పడుతున్నారు. వీటిని పారిశుధ్య సిబ్బంది తొలగించడం లేదు. నగరంలో ని అన్ని కాలనీల్లోకి చెత్త సేకరణ వాహనాలు వస్తు న్నా ఈ కాలనీలోకి చెత్తబండ్లు రావడం లేదు. దీంతో కాలనీవాసులు రోడ్డుపైనే చెత్తను వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా నెలకొంటోంది.

ఖాళీ స్థలాల్లో మురుగు..

డ్రయినేజీలు సరిగా నిర్మించకపోవడంతో మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో కాలనీలో దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు, ఈగలు పెరిగి స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. పందులకు ఆవాసంగా మారుతున్నాయి.

కాలనీకి రాని చెత్తబండ్లు

పారిశుధ్య సిబ్బంది కాలనీలోకి ప్రతీరోజు రావడం లేదు. దీంతో మురుగు అలాగే నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. చెత్తవాహనాలు సైతం కాలనీలకు రావడం లేదు. దీంతో స్థానికులు బీడీలు చేసే తునికాకు, ఇతర చెత్త పదార్థాలు రోడ్డుపైనే పారవేస్తున్నారు. దీంతో చెత్త పెరిగి కుప్పలుగా మారాయి.

డ్రెయినేజీలను మేమే శుభ్రం చేస్తున్నాం



మా కాలనీకి మున్సిపల్ సిబ్బంది రావడం లేదు. దీంతో డ్రెయినేజీలు నిండిపోతే మేమే కర్రలు పెట్టి శుభ్రం చేసుకుంటున్నాం. మా ముందే తిరుగుతున్నారు కానీ మా గల్లీలోకి రావడం లేదు. ఎందుకని అడిగితే మాది కాదంటే మాది కాదని తప్పించుకుంటున్నారు.

– రాజు, స్థానికుడు, ఆనంద్‌నగర్

చెత్త బండ్లు వస్తలేవు



చెత్తను తీసుకెళ్లే వాహనాలు కాలనీలోకి వస్తున్నాయి. కానీ, రోడ్డుమీద నుంచి వెళ్తున్నాయి. లోపలికి రావడం లేదు. దీంతో మహిళలు ఇళ్లలోని చెత్త తెచ్చి మూలమలుపుల వద్ద, విద్యుత్‌స్తంభాల వద్ద పోస్తున్నారు. దీంతో చెత్త చేరి మురికికూపాలుగా మారుతున్నాయి.

– ఓంప్రకాశ్, స్థానికుడు, ఆనంద్‌నగర్

సిబ్బందిని ఆదేశిస్తాం



ఆనంద్‌నగర్ కాలనీలో మురికి కూపాలు చాలా ఉన్నాయి. చాలా ఏళ్ల నుంచి ఖాళీ స్థలాలు ఉండి పిచ్చిమొక్కలు పెరిగాయి. సిబ్బంది ఎవరైనా అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. చెత్త వాహనాలు లోపలివరకు వెళ్లాలని సిబ్బందిని ఆదేశిస్తాం

– జయకుమార్, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో

‘పది’ పరీక్షలు.. విస్తృతంగా తనిఖీలు



డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



ఇందల్వాయి: గన్నారం పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

డిచ్‌పల్లి/ ఇందల్వాయి/ సిరికొండ/ నిజామాబాద్ రూరల్: పదో తరగతి పరీక్షలు నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. డిచ్‌పల్లి మండలంలో ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1268 మందికి 1266 మంది హాజరు కాగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. మోడల్ స్కూల్‌లో ఒకరు, గురుకుల పాఠశాలలో ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈవో పేర్కొన్నారు. ఇందల్వాయి మండలంలోని గన్నారం, ఎల్లారెడ్డిపల్లె, సిర్నాపల్లి, ఇందల్వాయి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో మొత్తం 467 మందికి ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు. సిరికొండ మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 569 మందికి గాను సిరికొండ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ఎంఈవో రాములు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. రూరల్ మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమైనట్లు పరీక్ష నిర్వహణ అధికారి భూమాగౌడ్ తెలిపారు.



సిరికొండలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



గుండారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

పారిశుధ్య పనుల తనిఖీ



నిజామాబాద్ సిటీ: నగరంలోని పలు డివిజన్లలో కొనసాగుతున్న చెత్త సేకరణ, పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ఎస్ దిలీప్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఖానాపూర్‌లోని చెత్త శుద్ధి కేంద్రాన్ని, నాగారంలోని డంపింగ్‌యార్డును శానిటరీ అధికారులతోకలిసి పర్యవేక్షించారు. బయోవేస్టేజీ విధానాన్ని చూశారు. చెత్తను రీసైక్లింగ్ చేసే ప్రక్రియ నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్, డంపింగ్‌యార్డ్ ఇన్‌చార్జి ప్రభురాజ్ తదితరులు ఉన్నారు.

పోలీస్ కార్యాలయాలను తనిఖీ చేసిన సీపీ



ఖలీల్‌వాడి/ ఎడపల్లి: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయాలను సీపీ సాయిచైతన్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భరోసా సెంటర్, షీ టీమ్ కార్యాలయం, పోలీస్ ఫిల్లింగ్ స్టేషన్, సౌత్ రూరల్ ఆఫీస్‌లను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. సీపీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా ఎడపల్లి పీఎస్‌ను సీపీ తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీపీ వెంట పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది ఉన్నారు.

హామీల అమలుపై చేతులెత్తేసిన కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, నాయకులు

ధర్పల్లి: బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ఆరు గ్యారెంటీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణలో మాదిగలు 11 శాతం రిజర్వేషన్ కోరగా 9 శాతం అమలు చేసి వారికి అన్యాయం చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులచారిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్క గంగారెడ్డి, చిలుక మహేశ్, నరేశ్ గౌడ్, రాము, మురళి గౌడ్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సిరికొండ: మండలంలోని న్యావనందిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రవీణ్, ముత్తెన్న, నరేందర్, జనార్దన్, సాగర్, తేజ, గణేశ్, చందు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటకు రూ.30వేల పరిహారమివ్వాలి



పంటలను పరిశీలిస్తున్న నాయకులు

మోపాల్: యాసంగిలో వరి సహా ఇతర పంటలకు నీరందక ఎండిపోతున్నాయని, ఎండిపోయిన పంటకు ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం రైతులకు ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎండిన వరి పొలాలను ఏఐకేఎంఎస్ బృందం పరిశీలించింది. అనంతరం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్ఐ రాజేశ్వర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతూ.. రైతులు అప్పులు చేసి వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశారని, తీరా పంట చేతికొచ్చే సమయంలో నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భజలాలు అడుగంటిపోయాయన్నారు. ఆరుతడి పంటల వైపు రైతులను మళ్లించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఎండుతున్న పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, ఎండిపోయిన పంటలకు రూ.30 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల పాపయ్య, దేశెట్టి సాయిరెడ్డి, అగ్గు ఎర్రన్న, అగ్గు చిన్నయ్య, బండమీది నర్సయ్య, గంగాధర్, ప్రకాశ్, అబ్బయ్య, ఎల్లయ్య, మహేశ్, గణేశ్, వినోద్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు రెండోరోజు శుక్రవారం కొనసాగాయి. గుడ ధ్వజారోహణ దేవత ఆహ్వానం తర్వాత సంతానార్థులకు గరుడ ప్రసాదం అందించారు. సాయంత్రం శేష వాహన సేవలో స్వామి వారి ప్రతిమలను ఉంచి ఊరేగించారు. మనసా వాచ కర్మన ఆ దేవదేవుడిని నమ్మితే కలికాలంలో ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి ప్రవచించారు. ఉత్సవం అంటే లోకమంతా సంతోషించడమని, బ్రహ్మోత్సవం అంటే సాక్షాత్తూ బ్రహ్మనే లోక కల్యాణం కోసం జరిపించే ఉత్సవమని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ప్రముఖ నిర్మాత దిల్ రాజు, నరసింహారెడ్డి, విజయసింహారెడ్డి, నర్సారెడ్డి, నరాల సుధాకర్, ప్రసాద్, రాజేశ్వర్, రమేశ్, సాయిలు, భాస్కర్, మురళి, చిన్నయ్య, గంగారెడ్డి, నరేశ్, సురేశ్, యజ్ఞాచార్యులు శ్రీఖర్ ఆచార్య, స్వామి రోహిత్ కుమారాచార్యులు, విజయ్ స్వామి, శిఖామణి స్వామి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పశువైద్యశాల



ధర్పల్లిలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల

- భయాందోళనలో సిబ్బంది
- నూతన భవనం నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు

ధర్పల్లి: మండల కేంద్రంలోని పశువైద్యశాల అధ్వానంగా మారింది. పూర్తిగా శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి అందులోనే మూగ జీవాలకు వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొంది. మూగజీవాలకు వైద్యం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పశువైద్యశాలలను ఏర్పాటు చేసింది. వైద్యసేవలు అందిస్తున్నా.. కొత్త భవనాల నిర్మాణంలో మాత్రం ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. ధర్పల్లిలో యాభై ఏళ్ల క్రితం నిర్మించిన పశు వైద్యశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో పశువైద్య సిబ్బందితోపాటు వైద్యశాలకు వచ్చే పశు పోషకులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవనం ఎప్పుడు ఏ క్షణాన కూలుతుందో అని సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. చిన్నపాటి వర్షాలు కురిస్తే పైకప్పు నుంచి వర్షపు నీరు గదుల్లోకి చేరుతోంది. పశువైద్యశాలలో ఉన్న మందులతో పాటు రికార్డులు తడిచిపోతున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాలకు కనీస మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో మొత్తం గొర్రెలు 14,320, గేదెలు 6,668, మేకలు 4,200, ఆవులు 3,600 ఉన్నాయి. ఈ పశు వైద్యశాలలో జీవాలకు వైద్యం అందించడానికి పశువైద్యాధికారితో పాటు ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నూతన భవనాన్ని నిర్మించాలి



పశువైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పశువులను తీసుకొని ఆస్పత్రికి వెళ్లాలంటే భయంగా ఉంటోంది. కొన్నేళ్ల నుంచి ఈ ఆస్పత్రిని అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. వచ్చే వర్షాకాలంలోపు నూతన భవన నిర్మాణాన్ని చేపట్టి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి.

– నల్ల పెంటన్న, రైతు, ధర్పల్లి

ప్రతిపాదనలు పంపాం



ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో అవస్థలు తప్పడం లేదు. భారీ వర్షాలు కురిస్తే పశువుల దాణా, మందులు తడిచిపోతున్నాయి. నూతన భవనాల నిర్మాణానికి గతంలోనూ ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

– అభిషేక్, పశు వైద్యాధికారి, ధర్పల్లి

హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని నిలిపివేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఐటీఐ కళాశాల ఎదుట సీఎం రేవంత్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పోరాటాలు, నినాదాలు చేయొద్దని రిజిస్ట్రార్ చే జీవో జారీ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. ఈ జీవోను వెనక్కి తీసుకోవాలని పోరాటాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో దినేశ్, రాజు, వికాస్, సాయి, రోహిత్, నరేశ్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీలో..

తెయూ(డిచ్‌పల్లి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల అమ్మకం నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బి శివ డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో క్యాంపస్ కళాశాల వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజాపాలన అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొనఊపిరితో ఉన్న విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే అంబేడ్కర్, ఉస్మానియా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూములను వేలం వేయాలని చూడటం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, మోహన్, నాయకులు సమీర్, రోహన్, నవీన్, సాయికుమార్, అనిత, నవీన, విద్యార్థులు పాల్గొన్నారు.



తెయూలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,600	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	83,620		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	140
	(కిలోకు)	లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	75
బీరకాయ	50	75	దోసకాయ	30	50
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నిసకాయ	30	50	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	10	20
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	50	75
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	30	50			

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 కోర్ట్ 1.40, 7.30, 10.30
ఆర్టిస్ట్(తెలుగు)-4.35
స్క్రీన్-2 ఎవడు సుబ్రహ్మణ్యం 10.50, 4.30
పెళ్లికాని ప్రసాద్ 1.40, 7.30
స్క్రీన్-3 ఎవడే సుబ్రమణ్యం(తెలుగు)-1.30
ఆర్టిస్ట్(తెలుగు)-7.30-సలార్-పార్ట్-1(తెలుగు)-10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 ఛావా 10.00, 4.45, 10.45
అనగనగా ఆస్ట్రేలియాలో-1.20 షణ్ముక-8.05
స్క్రీన్-2 కోర్ట్-10.05, 4.30, 7.35, 10.40
ఛావా(హిందీ)-1.10
స్క్రీన్-3 కిస్ కిస్ కిస్సిక్-11.00, 7.30
షణ్ముక-1.50 - ఆర్టిస్ట్-4.30, 10.20
స్క్రీన్-4 సలార్-పార్ట్-1-10.20, 4.25, 10.30 పెళ్లికాని ప్రసాద్-1.50, 7.55
లలితామహల్ కోర్ట్, దేవి పెళ్లికానిప్రసాద్
నటరాజ్ షణ్ముక, విజయ్ సలార్